www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023 5 ఏలూరు



ఎపి నిట్ ప్రొఫెసర్‌కు జాతీయస్థాయి అవార్డు

తాడేపల్లిగూడెం:స్థానిక ఎపి నిట్‌లోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రఫీమహ్మద్ పరిశోధనలగాను డిస్టింక్షన్ ఇన్ కొరోషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ కేటగిరి విభాగంలో జాతీయ అవార్డు లభించింది. ఇటీవల కార్పొరేషన్ పేరుతో ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ముంబై) వైస్ ఛాన్సలర్ డాక్టర్ పండిట్ నిరుద్ చేతుల మీదుగా అవార్డును, రూ.25 వేల నగదు ప్రోత్సాహాన్ని రఫీ అందుకున్నారు. రఫీ ఇప్పటి వరకు ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో 25 కథనాలను ప్రచురించగా, నేషనల్, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో 50 పేపర్లను సమర్పించారు. ఈయనను నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశోధనలు దేశ అభ్యున్నతికి వెన్నెముకగా నిలుస్తాయని, అటువంటి పరిశోధనా విభాగంలో ఎపి నిట్ ప్రొఫెసర్‌కు రఫీకి జాతీయస్థాయి అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు.

'చింతలపూడి' పూర్తి చేస్తాం

మామిడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు

నూజివీడు మున్సిపాల్టీలోని ఒక్కో సచివాలయ పరిధిలో అభివృద్ధికి రూ. కోటి

నూజివీడు సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి

సభకు పెద్దసంఖ్యలో కాలేజీ విద్యార్థుల తరలింపు

పోలీసుల ఆంక్షలతో జనం తీవ్ర ఇబ్బందులు



లబ్ధిదారులకు అసైన్డ్ పట్టాలు అందిస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/నూజివీడు టౌన్

చింతలపూడి ఎత్తిపోతల పథకంపై తనకు అవగాహన ఉందని, ప్రాధాన్యతా క్రమంలో యుద్ధప్రాతిపదికన ఈ సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని సిఎం జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన, లంక భూములకు పట్టాపివ్వడం, చుక్కల భూములు, షరతుల గల పట్టాభూములు, సర్వీస్ ఇనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించడం, భూమి కొనుగోలు పథకం కింద ఇచ్చిన భూములపై హక్కుల కల్పన, గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి సంబంధించిన కార్యక్రమాన్ని సిఎం నూజివీడులో శుక్రవారం ప్రారంభించారు. 10.45 గంటలకు స్థానికంగా ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్న సిఎంకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా సభాస్థలికి సిఎం చేరుకున్నారు. భూముల రీసర్వే సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సిఎం పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభా వేదికపైకి చేరుకుని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలుత కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్వాగతోపన్యాసం చేశారు. ఏలూరు జిల్లాలో వ్యవసాయ రంగానికి సహకారం అందిస్తూ, మెడికల్ కాలేజీ స్థాపించిన సిఎం జనాల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. ఏలూరు జిల్లాలో భూమిలేని నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ 752 మంది పేదలకు 693.25 ఎకరాల భూపంపిణీ ప్రభుత్వం చేస్తుందన్నారు. జిల్లాలో 13,077 మందికి చెందిన 16,446 ఎకరాలను భూముల రిజిస్ట్రేషన్ చట్టం నిషేధిత జాబితా నుంచి తొలగించడం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఎస్‌సి సామాజిక తరగతికి శ్మశానవాటికల కోసం 31 గ్రామాలకు 33.32 ఎకరాలు ఆయా గ్రామ పంచాయతీలకు అందించామన్నారు. భూహక్కు పథకం ద్వారా జిల్లాలో ఆర్ గ్రామాలకు ఆర్ఓఆర్ పూర్తయ్యి.. యాజమాన్య పత్రాల జారీ జరగబోతుందని తెలిపారు.

మాట్లాడుతున్న సిఎం

ఎంఎల్‌ఎ కోరారు.. సిఎం హామీ ఇచ్చారు

నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ గతంలో నూజివీడు నియోజకవర్గానికి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. తాగునీరు, ట్రిపుల్ ఐటి ఏర్పాటు, ఎస్‌టిలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. చంద్రబాబు నూజివీడు నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. సిఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లోనూ జగన్ గెలిచి రెండోసారి సిఎం అవుతారన్నారు. టిడిపికి రెండు సీట్లు రావడం గగనమే అన్నారు. నూజివీడు మున్సిపాల్టీలో అభివృద్ధి లేకుండా పోయిందని, పట్టణంలో 32 వార్డులు ఉన్నాయని, సచివాలయానికి రూ.50 లక్షలు చొప్పున ఇవ్వాలని కోరారు. మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌కు సంబంధించి రూ.275 కోట్ల అంచనాతో రెండో ఫేజ్‌లో ఉందని, దీనికి 26 ఎకరాలు ఇవ్వడం జరిగిందన్నారు. వెంటనే దీనికి అనుమతి ఇవ్వాలని కోరారు. సాగునీటికి అత్యంత అవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని ఎంఎల్‌ఎ కోరారు. సిఎం తన ప్రసంగంలో ఎంఎల్‌ఎ అడిగిన వాటిపై మాట్లాడుతూ నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో 16 సచివాలయాలు ఉన్నాయని, ఒక్కో సచివాలయానికి రూ.కోటి చొప్పున నిధులిస్తున్నట్లు ప్రకటించారు. నూజివీడు ప్రాంతంలోని మామిడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.275 కోట్లతో మామిడిగుజ్జు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికలను తయారు చేసి బ్యాంకులకు పంపించడం జరిగిందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. సిఎం తిరిగి వెళ్లేటప్పుడు హెలిప్యాడ్ వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, ధర్మాన ప్రసాదరావు, పినిపే విశ్వరూప్, మేరుగ నాగార్జున, ఎంపీలు కోటగిరి శ్రీధర్, మిథున్‌రెడ్డి, జిల్లాలోని ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు అబ్బాయిచౌదరి, ఎలిజా, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాలేజీ విద్యార్థుల తరలింపు

శుక్రవారం నాగులచవితి కావడంతో మహిళలు పెద్దగా సిఎం సభకు రాలేదు. దీంతో స్థానికంగా ఉన్న కాలేజీ విద్యార్థులను పెద్దఎత్తున సిఎం సభకు తరలించారు. వివిధ ప్రాంతాల నుంచి సైతం పెద్దఎత్తున జనాన్ని సభకు తరలించారు. పోలీసుల ఆంక్షలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిఎం సభ పూర్తయిన తర్వాత కాన్వాయ్ గంటవరకూ ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిపివేయడంతో జనం ఎండకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సిఎం వస్తున్నారని.. సిపిఎం, టిడిపి నేతలపై నిర్బంధం

ప్రజాశక్తి- యంత్రాంగం

సిఎం జగన్ నూజివీడు పర్యటన సందర్భంగా ఏలూరు జిల్లాలో పలుచోట్ల సిపిఎం నాయకులను ముందస్తుగా పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. పలువురిని గృహ నిర్బంధం చేశారు. నూజివీడు మండలం గొల్లపల్లిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహను, ఉంగుటూరు మండలం కైకరంలో కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావును నిడమర్రు మండలంలో భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి, సిపిఎం నేత నారపల్లి రమణరావును, ఇతర కార్మిక, ప్రజా సంఘాల నాయకులను పోలీసులు గురువారం అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేశారు. పలువురిని గృహ నిర్బంధం చేశారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం : సిపిఎం

ఏలూరు:సిఎం జగన్ నూజివీడు పర్యటన సందర్భంగా సిపిఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం, గృహనిర్బంధానికి పాల్పడటం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. రాష్ట్రంలోని 175 స్థానాలూ తామే గెలుస్తామని, తమ పరిపాలన పట్ల ప్రజలకు సానుకూలత ఉందని గొప్పలు చెప్పుకునే సిఎం ఈ విధమైన చర్యలకు పాల్పడడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నిజంగా మంచి పరిపాలనే అందిస్తే ప్రతిపక్షాలకు భయ పడాల్సిన అవసరం ఈ ముఖ్యమంత్రికి లేదన్నారు. నిర్బంధాలు, అణచివేతలు, దౌర్జన్యాలతో ఎంతో కాలం ప్రజలను మభ్య పెట్టలేమని, చరిత్రలో ఇలా ప్రవర్తించిన అనేకమంది కాలగర్భంలో చరిత్ర హీనులుగా మిగిలిపోయారనే విషయాన్ని గుర్తు చేసుకో వాలని హితవుపలికారు. సిఎం తమ వద్దకు వస్తున్నారంటే తమ ఇబ్బందులను, సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని కోరేందుకు ప్రజల ముందుకు వస్తారని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉంటుందని తెలిపారు. సిపిఎం ఎప్పటికీ ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటుందని, ఈ నిర్బంధాలకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

నిడమర్రు:అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం జగన్ నూజివీడు పర్యటన సందర్భంగా ముందస్తుగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణ రావును గురువారం అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఉద్యమకారులను నిర్బంధించడం అప్రజాస్వామికమని, హక్కులకు భంగం కలిగించడమేనని విమర్శించారు. సిఐటియు నాయకులు కంచ వరప్రసాద్, గవర సత్యనారాయణ, గోక సూరిబాబు, కోసూరి శివ, రోకల ఏసురెడ్డి, డి.పాండు, కమిలి నాని, కానూరు రాజు అక్రమ అరెస్టును ఖండించారు.

ఏలూరు అర్బన్ : సిఎం జగన్ నూజివీడు పర్యటన సందర్భంగా రైతు, కౌలురైతు సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నూజివీడు మండలం గొల్లపల్లిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహను, ఉంగుటూరు మండలం కైకరంలో కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావును ఇతర ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్న ప్రతిసందర్భంలోనూ ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, ఈ తీరును ప్రభుత్వం మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అర్ధరాత్రులు పోలీసులు, ప్రజా సంఘాల, రైతు సంఘాల నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవని మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు.

ముసునూరులో టిడిపి నేతను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

టిడిపి, జనసేన నాయకుల అరెస్టు

ముసునూరు:సిఎం జగన్ నూజివీడు పర్యటన సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు గద్దె రఘుబాబు, రమణక్కపేట గ్రామానికి చెందిన జనసేన నాయకులు పాశం నాగబాబు, మరీదు శివరామకృష్ణ, ఎం.సునీల్‌కుమార్, బండారు రాజును, సిపిఎం నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం పర్యటన నేపథ్యంలో వామపక్ష నాయకులను, ప్రజా సంఘాల నేతలను, ప్రతి పక్ష నేతలను అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

మహేంద్రది ప్రభుత్వ హత్యే : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో వైసిపి గ్రూపు విబేధాల నేపథ్యంలో దళిత యువకుడు బొంతా మహేంద్ర మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. దొమ్మేరులో మహేంద్ర ఆత్మహత్య వైసిపి చేసిన హత్యేనన్నారు. వైసిపి గ్రూపు తగాదాలకు దళిత యువకుడిని బలిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకుండా పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు వైసిపి కార్యకర్తల్లా ఉన్నారని విమర్శించారు. రోజంతా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం వల్ల భయంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందన్నారు. మహేంద్రను విడుదల చేయించాలని అతని కుటుంబ సభ్యులు హోం మంత్రిని కోరినా కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనకు ఆమె బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ గ్రూపుల పోరులో దళిత యువకుడు బలికావడం బాధాకరమన్నారు. చిన్న ఫ్లెక్సీ వివాదాన్ని ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో దళిత యువకుడిని అక్రమంగా పోలీస్ స్టేషన్లో నిర్బంధించి, చివరికి అతని మృతికి కారణమైన పోలీసులపై, వారికి అండగా నిలిచిన వైసిపి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

బిజెపి రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ఆర్ పేటలోని స్ఫూర్తి భవనంలో ఎపి రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా మహాధర్నా కరపత్రాల ను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.కృష్ణమాచార్యులు మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతాంగాన్ని మోసగించిందని విమర్శిం చారు. దేశ సంపదను ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటలకు కనీస ధరలు రాక నష్టపోతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తక్షణం తేవాలని డిమాండ్ చేశారు. రూ.లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం నష్టాల్లో ఉన్న రైతుల పంట రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. కరువుతో పంటల నష్టపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగుతున్న మహాధర్నా విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో విస్తత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు కొర్రి విజయలక్ష్మి, కాకి నాని, ఎ.అప్పలరాజు, వి.సాయిబాబా, బి.జగన్నాథం పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి - ఏలూరు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను (ఆప్కాస్) పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈనెల 20, 21 తేదీల్లో ఆందోళనలు చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు, 21న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద వంటా-వార్పు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్ష, కార్యదర్శులు బి.బాలరాజు, ఎ.జాన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాలిటీల్లో నిరసన ప్రదర్శనలు జరపాలని, 21 తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద వంటా-వార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు సిఎం జగన్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను ఆరు మాసాల్లో పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, కానీ నేటి వరకూ దాన్ని అమలు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఈ ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు, ప్రజానీకం అందరు మద్దతు తెలపాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

నష్టదాయకంగా సామాజిక మాధ్యమాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సోషల్ మీడియా నష్టదాయకంగా మారుతోందని, అలాగే మత్తుపదార్థాలు మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయని జిల్లా విద్యాశాఖ ఎఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ జి.రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా తంగెళ్లమూడిలోని సెయింట్ మిచైల్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'సామాజిక మాధ్యమాలు - వాటి దుష్ఫరిణామాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ రోజుల్లో పిల్లలు, పెద్దలు సామాజిక మాధ్యమాలకు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారన్నారు. నిత్యం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సాప్, యూట్యూబ్‌కి ఆకర్షితులవుతున్నారని చెప్పారు. వీటివల్ల యువతకు, బాలలకు మంచికంటే చెడు ఎక్కువగా జరుగుతుందని పేర్కొన్నారు. వీటిని నియంత్రించే పద్ధతులు తెలియకపోవడం వల్ల వారు లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి కె.రాజేశ్వరి మాట్లాడుతూ సోషల్ మీడియా కీడు ఎక్కువగా చేస్తుందని, మత్తు పదార్థాలు ప్రస్తుతం అన్ని ప్రదేశాల్లో అందుబాటులో ఉంటున్నాయని, వ్యక్తుల్లో ఒంటరితనం, ఒత్తిడికి సోషల్ మీడియా కారణమవుతుందని చెప్పారు. తద్వారా అనేక మందిలో నిద్ర లేమికి కారణమవుతుందని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయని తెలిపారు. సోషల్ మీడియాతో వచ్చే దుష్ప్రభావాలు - వెనుకబడిపోతున్నామనే భయం, ఒంటరితనం, నిరాశ, ఆందోళన, సైబర్ బెదిరింపులు ఉంటాయని, అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి నెహేమియా మాట్లాడుతూ బాలలకు సామజిక మాధ్యమాల గురించి అవగాహన పెంపొందించేందుకు 'సామజిక మాధ్యమాలు - వాటి దుష్ఫరిణామాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిస్టర్ రెజీనా, ఉపాధ్యాయులు అనిత, కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో గట్టి భద్రతా చర్యలు: డిఎస్‌పి

మొగల్తూరు: కార్తీక మాసం సందర్భంగా పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యం లేకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని నరసాపురం డిఎస్‌పి రవిమనోహరాచారి అన్నారు. శుక్రవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి విలేకరులతో మాట్లాడారు. బీచ్‌లో బందోబస్తుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. అక్కడ ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తాము చేపట్టిన చర్యలకు పర్యాటకులు సహకరించాలని కోరారు. డివిజన్‌లో నేరాలను అదుపు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట ఎస్ఐ ఎం.వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

స్కూల్లోనే వండించి పెట్టండి

'మధ్యాహ్న భోజనం' తనిఖీలో హెచ్‌ఎంకు డిప్యూటీ సిఎం కొట్టు ఆదేశం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'స్కూల్లోనే మధ్యాహ్న భోజనం వండించి విద్యార్థులకు పెట్టండి' అని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ పట్టణంలోని జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన కొట్టు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మంత్రి ముచ్చటించారు. మధ్యాహ్నం భోజనం ఎలా ఉంటుంది, మీ ఇంటి వద్ద బాగుందా, ఇక్కడ బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. వేరుశెనగ చెక్కీలు ఇవ్వకపోవడం, ఆకుకూర పప్పు బాగా పలచగా ఉండడాన్ని, అన్నం ముతకగా ఉండడాన్ని మంత్రి గుర్తించారు. కోడిగుడ్లు చిన్న సైజులో ఉండడం, కొన్ని అదిలిపోయినట్లు పైకి పొక్కిపోవడాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ స్కూల్లోనే మధ్యాహ్న భోజనం వండి పెట్టాలని గతంలోనే తాను చెప్పానని, ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని స్కూల్ హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇప్పటికైనా మధురాన్నంను ఆపి ఇక్కడే వండి పెట్టేలా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. మెనూ కచ్చితంగా అమలమయ్యేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నేతలు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు ఉన్నారు.

తల్లాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజల పొట్టకొట్టొద్దు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఐదో కాంటూరు పరిధి దాటి పది కిలోమీటర్ల వరకూ పర్యావరణం పేరుతో 26 నిబంధనలను పెట్టి వేలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని కైకరం, తల్లాపురం గ్రామాలను వారు సందర్శించారు. తల్లాపురంలో సర్పంచి పసుపులేటి నరసింహారావుతో పాటు గ్రామ రైతులు పాల్గొన్న సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, రైతు సంఘం నేత గుత్తికొండ వెంకటకృష్ణారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు తదితరులు మాట్లాడారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరుతో జిరాయితీ, సొసైటీ చెరువులను నాడు ధ్వంసం చేసి కొల్లేరు ప్రజలను అనాథలను చేశారని, నేడు మళ్లీ పర్యావరణ సున్నిత ప్రదేశం పేరుతో ఐదో కాంటూరు పైన ఉన్న 89 గ్రామాల ప్రజల కొంప కొల్లేరు చేసే ఈ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా అన్ని గ్రామాల ప్రజలు ఐక్యమై ప్రతిఘటించాలని అలాగే అన్ని గ్రామాల్లో ఉన్న పంచాయతీలు తీర్మానాలు చేసి తమ వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ఎకో సెన్సిటివ్ జోన్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం ప్రజల కంటే పక్షులకే ఎక్కువ ప్రాధాన్యతివ్వడం దుర్మార్గమన్నారు. ప్రజలకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, కేంద్ర ప్రభుత్వం వారు వాస్తవ విషయాలను చెప్పి ప్రజాభిప్రాయం సేకరించడం బదులు కేవలం మండల కేంద్రాల్లో కొద్దిమందితో అభిప్రాయ సేకరణ జరిపి ప్రజలకు వ్యతిరేకమైన అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే చూస్తూ ఊరుకోబోమని వారు హెచ్చరించారు.

ఐదో కాంటూరు వరకే సెన్సిటివ్ జోన్‌గా నిర్ణయించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఫారెస్ట్ అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

కొల్లేరు అభయారణ్యం చుట్టూ సున్నిత పర్యావరణ ప్రాంతం ఏర్పాటు కంటే ముందుగా కొల్లేరు ఆక్రమణలు, కాలుష్యం నివారించి, ముంపు నివారణ సరస్సు అభివృద్ధి, ప్రజల జీవనోపాధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యకర్తలు ఎల్ఎస్.భాస్కర్‌రావు స్పష్టం చేశారు. కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ ప్రాంతంపై ఆయన అభిప్రాయాన్ని తెలియజేస్తూ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కైకలూరు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలు పెరిగి రొయ్యలు, చేపల చెరువుల నిర్మాణం జరిగిందన్నారు. మితిమీరి సాగుతున్న రొయ్యల సాగుతో విడుదలవుతున్న రసాయనాలు, ఉప్పునీరు, వ్యర్థాలు, కొల్లేరులో చేరి కలుషితమవుతుందని తెలిపారు. కొల్లేరు కలుషితమవడం వల్ల అపారమైన మత్స్య సంపద నానాటికీ తగ్గిపోతుందని, కొన్నిరకాల నల్లజాతి చేపల సంతతి కనుమరుగవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ఆపరేషన్‌కు ముందు కొల్లేరు ప్రజల జీవనోపాధి ఎలా ఉందో ఆ తర్వాత కూడా అంతకు తగ్గకుండా ఉండేలా చూడమని సుప్రీంకోర్టు సాధికారత కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినప్పటికీ 17 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదన్నారు. రెగ్యులేటర్ నిర్మాణం ఛానలైజేషన్ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి ముంపు నివారణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. కొల్లేరు పదో కాంటూరు మేర పరివాహక ప్రాంతంగా ఉన్నప్పటికీ 120 జిఒతో ఐదో కాంటూర్ వరకూ ఆక్రమణలు తొలగించి పరిమితం చేశారన్నారు. ఐదో కాంటూరు పరివాహక ప్రాంతాలకు ఎకో సెన్సిటివ్ జోన్‌గా మాత్రమే నిర్ణయించాలని పది కిలోమీటర్ల మేర పెంచడం వల్ల ఉపయోగం లేకపోగా నష్టం వాటిల్లుతుందన్నారు. దీనివల్ల కొల్లేరు గ్రామాల ప్రజలతోపాటు మరికొన్ని గ్రామాల ప్రజలు ఉపాధిని కోల్పోతారని ఆయన తెలిపారు. పక్షులకు ఇబ్బందులు కలగకుండా ప్రజలకు జీవనోపాధి ఉండేలా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు పాల్గొన్నారు.

భీమడోలులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

12,826 ఎకరాల్లో వరిసాగు

38,478 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

వ్యవసాయాధికారి ఉషారాణి

ధాన్యం తరలింపును ప్రారంభిస్తున్న సొసైటీ కార్యదర్శి వీరమణి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇ-క్రాప్ పంట నమోదు ఆధారంగా 12,826 ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. పంటకోత ప్రయోగాల ఫలితాలు ఆధారంగా ఒక ఎకరానికి 40 బస్తాలు (మూడు టన్నులు) వంతున 38,478 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా వ్యవసాయ అధికారి తెలిపారు. ఇప్పటివరకు మండల పరిధిలో ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకించిన 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా 933 ఎకరాల నుంచి వచ్చిన 479 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగినట్లు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ధాన్యం సేకరణ విషయమై నిబంధనలు రైతులకు అనుకూలంగా మారాయని తెలిపారు. ఈ మేరకు రైతు భరోసా కేంద్రం, అక్కడ కస్టోడియన్ అధికారిగా వ్యవహరించే గ్రామ రెవెన్యూ అధికారికి కేటాయించిన ప్రత్యేక యాప్ ద్వారా తేమ శాతం నిర్ధారణ జరుగుతుందన్నారు. దీనివల్ల తేమశాతం ఖరారు కోసం రైతులు, మిల్లర్ల అనుమతుల కోసం గతంలో మాదిరిగా ఎదురు చూడాల్సిన అవసరం లేదన్నారు. ఇక నూతన విధానంలో భాగంగా రవాణా వాహనాలకు జిపిఎస్ పరికరాలు అమరిక జరిగిందన్నారు. దీని ఆధారంగా మిల్లుల వద్ద ధాన్యం తరలింపులో జాప్యం తొలగిపోవడం, ధాన్యం తరలింపుపై ఇబ్బందులు ఉండవన్నారు. భీమడోలులోని రైతు భరోసా కేంద్రాల అవసరమైన రవాణా వాహనాలను పౌరసరఫరాల సంస్థ సమకూర్చుతుందన్నారు. దీనికి అదనంగా రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం తరలింపునకు ఆసక్తి గల 90 వరకు ట్రాక్టర్లు, లారీలు తమ వివరాలను నమోదు చేసుకుని ధాన్యాన్ని రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటికి జిపిఎస్ పరికరాల అమరిక జరిగిందన్నారు. ఇదే క్రమంలో ధాన్యం సేకరణకు పది లక్షల గోనె సంచెలు అవసరమవుతాయని అంచనా కట్టామన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత అవసరాలకు సరిపడా రెండు లక్షల గోనె సంచులు సిద్ధం చేసినట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి, రెండో వారాల నాటికి ధాన్యం సేకరణ పూర్తవుతుందన్న ఆశాభావాన్ని వ్యవసాయ అధికారి వెలిబుచ్చారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

ఇ-క్రాప్ నమోదు ఆధారంగా మండలంలో వరి సాగు చేసే విస్తీర్ణం తగ్గినట్లు గుర్తించామన్నారు. గతంలో 13,286 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరుగగా ప్రస్తుతం ఆ విస్తీర్ణం 12,826 ఎకరాలకు తగ్గిందన్నారు. సదరు విస్తీర్ణంలో చేపల చెరువులు ఏర్పడటం, ఇతర పంటలు సాగు చేయడం ప్రధాన కారణాలని తెలిపారు. దీని ఆధారంగానే ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. ప్రస్తుతం స్వర్ణ రకం వరి ధాన్యం సేకరణ ముమ్మరంగా జరుగుతుందని, రానున్న కాలంలో ఆలస్యంగా కోతకు వచ్చే పిఎల్ 1100 రకం ధాన్యం సేకరణ ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు కైకరం విద్యార్థి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వందాని నాగసాయిశివకుమార్ ఏలూరు కస్తూరిబాయి నగరపాలక బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఖాదీ మహోత్సవ్ జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో పాల్గొని ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కన్నారావును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.


సాంబశివరావును సత్కరిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

నారాయణపురం ఉప సర్పంచికి సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం ఉప సర్పంచి మరడ సాంబశివరావును ఆ గ్రామ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి సన్మానించారు. ఉప సర్పంచిగా సాంబశివరావు ఎన్నికైన సందర్భంగా పార్టీలకు అతీతంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బళ్ల శ్రీరాములు, ఎంపిటిసి మాజీ సభ్యులు కర్రి రామారావు, తోట్ల గణపతి, సప్పా వీరబాబు, నల్ల ఆనంద్, యూత్ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సందడి చేశారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఎంఇఒ డి.రామారావు తెలిపారు. మండలంలోని ఇంగిలంపాకలంక, నందిగామలంక పాఠశాలలను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను సదుపాయాలను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేవిధంగా చూడాలన్నారు. ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం, జగనన్న విద్యాకానుక కిట్లు అందరికీ వచ్చాయా లేదో అనేది విద్యార్థులను అడిగి తెలుసుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు రోజూ హాజరయ్యేలా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి అప్పారావు, నందిగామ లంక, ఇంగిలిపాకలంక ప్రధానోపాధ్యాయులు నాగాంజనేయులు, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ సమావేశంలో టిడిపి, జనసేన నాయకులు

ఉమ్మడి కార్యాచరణతో ముందుకు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రానున్న ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్తామని టిడిపి, జనసేన నాయకులు అన్నారు. స్థానిక వైష్ణవి కళ్యాణ మండపం వద్ద టిడిపి, జనసేన మండల సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి, జనసేన నాయకులు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టిడిపి, జనసేన అన్ని విషయాల్లో కలిసి పని చేస్తుందన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. టిడిపి, జనసేన ఒకే కుటుంబంలా కలిసి పని చేస్తామని టిడిపి నాయకుడు ఇమ్మడి రత్నాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర సెక్రటరీ క్రొరాకుల బుజ్జియాదవ్, నియోజకవర్గ వాణిజ్య సెల్ అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, బిసి సెల్ మండల అధ్యక్షులు రేవూరి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు కొరపాటి మనమ్మవెంకన్న, టిడిపి సీనియర్ నాయకులు గువ్వల మావుళ్లరావు, కొత్తపల్లి సుబ్బారావు, గువ్వల నాగచంద్రం, చిలుకూరి హరిబాబు, తాడేపల్లి సుబ్బారావు, కటికల సుబ్రహ్మణ్యం, రావెళ్ల ఫణీంద్రచౌదరి, రాచప్రోలు బాలరాజ్, జనసేన నాయకులు చిలుకూరు ఫణి, మొయ్యే అంజిబాబు, కోపల్లి తులసి, కోపల్లి గోపీ, రాజేష్, తరగళ్ల శ్రీను, కోలా మణికంఠ పాల్గొన్నారు.


వెండిని విరాళంగా అందిస్తున్న దంపతులు

రజత వస్త్రం తయారీకి వెండి విరాళం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి రజత వస్త్ర తయారీకి దాతలు వెండి విరాళంగా అందించారని ఆలయ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారయణ తెలిపారు. పట్టణానికి చెందిన దాతలు మైరెడ్డి జగదీష్, లలిత దంపతులు ఐదు తులాల వెండిగిన్నె, నిమ్మగడ్డ సూర్యనారాయణ, పద్మ దంపతులు ఐదు తులాల వెండి, కోటపాటి నాగ మల్లేశ్వరరావు, లక్ష్మి దంపతులు ఐదు తులాల వెండి, ఉడతల సుబ్రహ్మణ్యం, విజయ దంపతులు ఐదు తులాల వెండి విరాళంగా ఇచ్చారని తెలిపారు. సుమారు 25 కిలోల వెండితో రజత వస్త్రం తయారు చేయించే క్రమంలో దాతల సహకారం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవ బృందం సభ్యులు, ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో తెలుగు భాష ప్రాముఖ్యత అంశంపై విద్యావేత్తల సహకారంతో శుక్రవారం చర్చాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్రాంత, ఉపాధ్యాయ ప్రముఖులు టివి.ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్, బాబురత్నం నిర్వహించారు. అనంతరం గ్రంధ పాలకులు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ముద్దు-సెల్‌ఫోన్లు వద్దు అంశంపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు జి.నాగమణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, బాలికా విద్య ఆవశ్యకత అంశంపై వకృత్వ పోటీలు, వేమన పద్యాల ఆలాపన పోటీలు నిర్వహించారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు అమర్నాథ్ ఆధ్వర్యంలో గ్రంథాలయ ప్రాముఖ్యత గురించి వివరిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం దిశచట్టంపై వ్యాసరచన, విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు.

ఏలూరు బాలల గ్రంథాలయంలో...

ఏలూరు : ఏలూరు బాలల గ్రంథాలయంలో ప్రముఖ లాయర్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సెక్రటరీ గుడిపాటి నరసింహరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి రచయితలు, కవుల గురించి వివరించారు. రాజారామ్మోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగంతో పాటు పలువురు వారి రచనల ద్వారా సమాజంలో దురాచారాలను రూపుమాపడానికి చేసిన సేవల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతివిద్యార్థి మాతృభాషలో చదవడం, రాయడం తప్పక తెలుసుకోవాలని వారు సూచించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణ గురించి తెలుపుతూ వారికి కావాల్సిన పుస్తకాలను ఎలా చూసుకోవాలో గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ తెలిపారు. విద్యార్థులకు వేమన, సుమతి శతక పద్యాల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఎం.శోభ, ఎం.కీర్తి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో స్వచ్ఛభారత్‌లో పౌరుల పాత్ర అంశంపై, గురజ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇండో-సాక్షన్, లిటిల్ ఫ్లవర్, సహాయమాత, జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు 140 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం వై.విజయ్‌కుమార్, గిరిధర్, సురేష్, లక్ష్మికుమారి, రేణుక, శివరంజని, ఆయా గ్రంథాలయాల అధికారులు ఎం.శ్రీదేవి, జి.జాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి గ్రంథాలయంలో జూనియర్స్, సీనియర్స్ డిబెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కృష్ణయ్య, సైన్స్ మాస్టర్ చంటిబాబు వ్యవహరించారు. వికాస్ కాలేజీ విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డిబెట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని చాట్రాయి గ్రంథాలయ శాఖ లైబ్రరీ మాస్టర్ బి.మణికంఠ నిర్వహించారు.

భీమడోలులో...

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే నిలయాలని గ్రంథాలయ ఛైర్మన్ నల్లూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం, కవి సమ్మేళనం, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక, కళానైపుణ్యం, పోటీతత్వం అలవరచుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, కవులు బిఎన్.సాగర్, అశోక్, విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, సాయి సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ కె.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో బహుజన రచయితల సంఘం ఏలూరు సభ్యులు డివి.నరసయ్య, సాహితి మిత్రుల అధ్యక్షులు ఎల్ఆర్ పోలిశెట్టి సంయుక్తంగా చేపట్టిన కవి సమ్మేళనం విద్యార్థులను ఆకట్టుకుంది. అమ్మ నాన్న ప్రాముఖ్యతను తమ కవితల ద్వారా వివరించారు. విద్యార్థులతో కవితలను చదివించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్, సాహితీ మిత్రులు చక్కా జగన్మోహన్‌రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ శ్రీదేవి, కెపిఎస్ ఉపాధ్యాయుడు వర్మ పాల్గొన్నారు.

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య వంటి ప్రముఖుల జీవిత చరిత్ర విషయాలపై క్విజ్, వకృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ పాఠశాల, భారతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న వైద్యులు

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలికి శుక్రవారం ప్రముఖ వైద్యులు మనోజ్ ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 12వ తేదీ ఆదివారం ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామానికి చెందిన ఈడే నాంచారమ్మ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని రూ.3 లక్షల నగదు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కట్టు వస్త్రాలతో బయటపడ్డారు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న డాక్టర్ మనోజ్ గౌడ్, సంఘం నాయకులు పరసా ఏడుకొండలుతో కలిసి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. రూ.10 వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు నాంచారమ్మకు మనోజ్ అందించారు. పంగిడిగూడేనికి చెందిన ఆయుర్వేదం డాక్టర్ పరసా వీర్రాజు రూ.పది వేల నగదును బిసి నాయకులు పరసా ఏడుకొండలు చేతులు మీదుగా బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నాంచారమ్మకు దాతలు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

వెండి తాపడం తయారీకి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం అంతరాలయ ముఖ ద్వారమునకు వెండి తాపడం తయారీ నిమిత్తం శుక్రవారం దాత నగదు విరాళంగా అందించారు. హైదరాబాదుకు చెందిన మెండు వెంకటరమణరావు వెండి తాపడం తయారీ నిమిత్తం రూ.10,116లను ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్యలకు విరాళంగా అందించారు.

సౌత్ ఇండియా ఇంటర్ మహిళా కబడ్డీ పోటీలకు భవాని

ప్రజాశక్తి - మండవల్లి

చందుసాయిభవాని

సౌత్ ఇండియా ఇంటర్ మహిళా కబడ్డీ పోటీలకు లింగాల విద్యార్థిని చందుసాయిభవాని ఎంపికైనట్లు లింగాల పిఇటి వేణుబాబు తెలిపారు. ప్రకాశం జిల్లాలో నిర్వహించిన జెఎన్‌టియుకె కాకినాడ యూనివర్సిటీ మహిళా కబడ్డీ సెలక్షన్‌లో సాయిభవాని అత్యుత్తమ కబడ్డీ ఆటను కనబరిచి జెఎన్‌టియుకె యూనివర్సిటీ జట్టుకు ఎంపికైందని తెలిపారు. భవాని నవంబర్ 23, 24, 25 తేదీల్లో తమిళనాడులో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా భవానిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను గ్రామానికి చెందిన ప్రముఖులు, తల్లిదండ్రులు అభినందించారు. కబడ్డీలో రాణించి లింగాల గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పలువురు కోరారు.

72 మంది చిన్నారులకు ఉచితంగా గుండె చికిత్స

రోటరీ జిల్లా గవర్నర్ సుబ్బారావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పాఠశాలలో గవర్నర్ దత్తా

రోటరీ సంస్థ ద్వారా 72 మంది చిన్నారులకు ఉచితంగా గుండె చికిత్స అందిస్తామని రోటరీ జిల్లా గవర్నర్ సుబ్బారావు తెలిపారు. రోటరీ జంగారెడ్డిగూడెం అధ్యక్షులు రొంగల దేవీప్రసాద్, కార్యదర్శి బవిరిశెట్టి హనుమాన్ తిలక్ ఆధ్వర్యంలో గవర్నర్ దత్తా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఉప్పలమెట్ట సాంఘిక సంక్షేమ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన సేవాకార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ చోడిపిండి సుబ్రహ్మణ్యం వితరణతో పది సీలింగ్ ఫ్యాన్లను గవర్నర్ దత్తా చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ సుబ్బారావు మాట్లాడుతూ గుండెలో పుట్టుకతోనే రంధ్రం ఉన్న 72 మంది చిన్నారులను గుర్తించి పూర్తి ఉచితంగా శస్త్రచికిత్స అందిస్తామని తెలిపారు. ఇలాంటి ఇబ్బంది ఉన్నవారు రోటరీ జంగారెడ్డిగూడెం దృష్టికి తీసుకురావడం ద్వారా వైద్యసేవలు పొందవచ్చని రోటరీ జిల్లా 3020 గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు తెలిపారు. విద్యార్థి దశలో విద్యను నిర్లక్ష్యం చేయకుండా లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ దాకారపు కృష్ణ, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ లోకేష్, దాత చోడిపిండి సుబ్రహ్మణం, ధనకుమార్, జివి.ప్రసాద్ పాల్గొన్నారు.

గురజలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన సీసీ డ్రెయిన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం రూ.50 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లను డిఎన్ఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధ, సొసైటీ అధ్యక్షులు మేడూరి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి మంచాల సరస్వతి, ఉప సర్పంచి పి.కిరణ్మయి, పార్టీ నాయకులు ఈడే వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, ఎం.వసంతరావు, డి.శ్రీను, వివిధ శాఖల మండల స్థాయి ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానానికి ఉపాలయమైన చెరువుబజారులో ఉన్న శ్రీ వల్లీ దేవ సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముదినేపల్లి : నాగుల చవితి సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో పోటెత్తింది. ఆలయ ఆవరణలో ఉన్న పుట్ట వద్దకు భక్తులు వేలాదిగా చేరి పుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారిణి నేల సంధ్య యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలోని గురజ, పెదపాలపర్రు, ఉప్పరగూడెం, పెదగొన్నూరు, పెదపాలపర్రు, ముదినేపల్లి, వడాలి గ్రామాల్లోని శివాలయాల్లో, గ్రామాల్లో పొలాల గట్లపై ఉన్న పుట్టల వద్దకు మహిళలు పెద్ద ఎత్తున చేరి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

పేరు మార్పు ప్రకటన

నా కుమారుడు అయిన మండ శ్రీరుసయేంద్ర రెడ్డి పాస్‌పోర్టు నందు నా పేరు మండ ధనలక్ష్మి, మండ ధనలక్ష్మి (కొత్త పేరు). గతంలో నా పేరు మండ ధనలక్ష్మి (పాత పేరు), డోర్ నెం. 3-65, నడుపుంట వీధి, కంతేరు గ్రామం, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **మండ ధనలక్ష్మి** (పాత పేరు) **మండ ధనలక్ష్మి** (కొత్త పేరు)గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

సెల్: 7993369937

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కలవపూడి గ్రామం కాపురస్తులైన ఇగ్గీర్సి కరునమ్మ, W/o. జాన్ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **T068044** గల పాస్‌పోర్టు 13-11-2023వ తేదీన మా స్వగ్రామం కలవపూడి నుండి యనమదుర్రు గ్రామం మా బంధువులు ఇంటికి వచ్చి ప్రయాణంలో యనమదుర్రు నుండి మా స్వగ్రామం వచ్చుటకు ఆటో కోసం నిలబడి వేచి చూచుచుండగా నా హ్యాండ్ బ్యాగ్ మరియు నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

ఇగ్గీర్సి కరునమ్మ
W/o. జాన్, డోర్ నెం. 5-86
హరిజనపేట, కలవపూడి
కాళ్ళ మండలం, సెల్: 900065886

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ కం ఎనిమిదో ఆదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

FC OP No : 35/2023

గోవిందన్ వినోద్ కుమార్ ... పిటిషనరు

వర్సెస్

గుంటూరు లలిత .... రెస్పాండెంట్

To

గుంటూరు లలిత,
భర్త గోవిందన్ వినోద్ కుమార్,
తండ్రి గుంటూరు సీతారామయ్య, వయస్సు 23 సంవత్సరాలు, హిందూ గృహిణి, డోర్ నెంబర్ 3-145, కమ్మవారి వీధి, కొత్తూరు గ్రామం, పెద్దపాడు మండలం, పశ్చిమగోదావరి జిల్లానివాసం

పై నెంబర్ గల పిటిషనును, పిటిషనరు విడాకులు నిమిత్తం మీపై దాఖలు చేయగా, సదరు పిటిషను మీకు నోటీసు నిమిత్తం తేదీ: 04-12-2023కి వాయిదా వేసియున్నారు సదరు విషయంపై మీకు ఏమైనా ఆక్షేపణలువున్న యెడల సదరు తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై కోర్టు ఎదుట నీవు స్వయంగా గాని లేక వకీల్ ద్వారా గాని హాజరై మీఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించ బడునని తెలియజేయుచున్నాము

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

ఇట్లు
కుర్రి బ్రహ్మారెడ్డి
అడ్వకేట్, ఒంగోలు
ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 27/2020, O.S. 35/2017 of R.C.Puram S.C.J.

కర్రి హరినాథరెడ్డి, S/o. సత్యనారాయణరెడ్డి, వ్యవసాయం, గోపాల రామనాయుడు పేట, కొంకుదురు, బిక్కవోలు మండలం. ***...DHR***

Vs

కొప్పిశెట్టి దుర్గ, W/o. నాగు, వయస్సు 40 సం॥లు, డో.నెం. 4-102, వేగవరం, జంగారెడ్డిగూడెం మండలం. ***...JDR***

వేలం వాయిదా: 8-12-2023

ఈ నెంబరు డిక్రీ బాకీకిగాను JDR కు గల E.P. షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 8-12-2023వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥** లగాయతు వేలం జరుగును. వేలం నందు పాట పాడుకొనదలచినవారు వేలపు షరతులు కోర్టు నజారత్ నందు గాని, DHR గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన వేగవరం పంచాయితీ Limits వేగవరం గ్రామము ఆర్.ఎస్. నెం. 131, bearing D.No. 4-102, 331 చ॥గజముల ఖాళీ స్థలంకు హద్దులు.
తూర్పు: 46-0 Feet రోడ్డు.
పడమర: 43-0 Feet హాటికల రాధాకృష్ణ యిల్లు.
ఉత్తరం: 68-0 Feet బండారు నాగరాజు యిల్లు.
దక్షిణం: 66-0 Feet గుళ్ళపల్లి మోజస్ చౌదరి.

యీ హద్దుల మధ్య గల 331 చ॥గజములు ఖాళీ స్థలం, అందలి గల నానావిధ ఫలవృక్షములతో సహా easement హక్కులతో సహా వేలం కావలెను.

DHR విలువ: రూ. 3,00,000/-
Amin విలువ: రూ. 6,62,000/-
JDR విలువ: NIL

ఎం.ఎస్.ఎస్.చక్రపాణి
అడ్వకేట్, కొవ్వూరు
సెల్: 9347626845

కొవ్వూరు
ది.14-11-2023